విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ప్రభుత్వ ఉద్యోగం బాధ్యతాయుతమైనది

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : ప్రభుత్వ ఉద్యోగమంటే చాలా బాధ్యతా యుతమైన దని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎ.పి. ఎన్.జి.ఓ సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను, ఏలూరు తాలూకా క్యాలండర్‌ను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో ప్రభుత్వ సిబ్బంది నిరంతర విద్యార్థిగా పరిపాలనకు సంబంధించిన అన్ని విషయాలు నిరంతరంగా తెలుసుకుంటూ నేర్చుకుంటూ ఉండాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరం ఒక టీం వర్కుగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించడంతోపాటు మన జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపగలమని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కోవిడ్ వైరస్ ను ఎదుర్కొనేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్. జి.ఓ సభ్యులందరికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్.జి.ఓ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్.జి.ఓ. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్. హరనాథ్, మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్ కె. నాగమణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా తాలూకా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తున్న షేక్ పీరా (53) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. గణపవరంలో ఎమ్మెల్యే వాసు బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పటానికి రెవెన్యూ అధికారులతో వెళ్ళారు. అక్కడ విషెస్ చెప్పి బయటకు వచ్చాక ఆయాసం తో కూర్చున్న పీరా గుండె పోటుతో పడిపోయారు. వెంటనే గణపవరం పీహెచ్సీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించగా పీరా మృతి చెందినట్లు తెలిపారు. పీరా మృతదేహాన్ని స్వగ్రామమైన ఉంగుటూరు తీసుకొచ్చారు. పీరాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.అటెండర్ పీరా మృతి పట్ల రెవిన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

గ్రీన్ విలేజస్‌గా 113 గ్రామాలు

విశాలాంధ్ర-నూజివీడు : జిల్లా పరిధిలో 123 క్రైమ్ విలేజస్ వుండగా 113 గ్రామాలను గ్రీన్ విలేజస్‌గా మార్చామని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండ్ అరుణకుమారి తెలిపారు. శనివారం నూజివీడులో ఆమె విలేఖరులతో మాట్లాడుతూ తమ శాఖ ద్వారా నాటు సారాయి తయారు చేసే గ్రామాలలో సారా తయారీదారులు,అమ్మకందారుల ప్రవర్తనలో మార్పులు తీసుకువచ్చామన్నారు. వారిలో 135 మందికి స్వయం ఉపాధి పదకానికి ఎంపిక చేయగా ఇప్పటికి 74 మందికి రూ.78.81 లక్షలు రుణాలు మంజూరు అయ్యాయన్నారు. జిల్లాలో ఇంకా పది గ్రామాలలు క్రైమ్ విలేజిలుగా వున్నాయని ఈ జాబితాలో దొరసానిపేట,ఐఎస్ జగన్నాధపురం,నాగిరెడ్డిగూడెం,వెస్ట్ యడవల్లి, కామవరపుకోట, ఎల్ఎన్‌డి పేట,పోతనపల్లి తండాలు,గుళ్ళపూడి, చనుబంద, పోలవరం గ్రామాలు వున్నాయన్నారు.ఈ ఏడాది అక్రమమద్యం సరఫరా చేసే 1408 వాహనాలను సీజ్ చేయగా 58 వాహనాలు రూ.15 లక్షలు ఫైన్‌లు చెల్లించి రిలీజ్ అయ్యాయన్నారు.1074 వాహనాలు ఆక్షన్ నిర్వహించగా రూ.1.83 కోట్లు వచ్చాయన్నారు. జిల్లాల విభజన అనంతరం తమ శాఖలో పరిధుల మార్పులు జరిగాయని నూజివీడు స్టేషన్ పరిధిలోకి చాట్రాయి,ముసునూరు మండలాలను కలిపినట్లు తెలిపారు.

పురపాలక సంఘ సాధారణ సమావేశం

విశాలాంధ్ర-నూజివీడు :నూజివీడు పురపా లక సంఘం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పుర పాలక సంఘ కౌన్సిల్ హాలులో జరిగిన ఈ సమావేశంలో టిట్కో ఇళ్ళ విషయం చర్చకు రాగా అధికార వైకాపా,ప్రతిపక్ష తెలుగుదేశం సభ్యుల మధ్య వాగ్వాధం చోటు చేసు కుంది.ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ టిట్కో ఇళ్ళను లబ్దిదారులకు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించగా వైకాపా సభ్యుడు శీలం రామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో అవినీతి జరిగిందని అందుకే సదుపాయాల కల్పన పూర్తి కాలేదని పేర్కొన్నారు.దీనికి స్పందించిన దుర్గాప్రసాద్ మీరు అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు గడుస్తోంది ఏమి చేశారని ప్రశ్నించారు.ఈ సమావేశంలో పలు అభివృద్ధి పథకాలతో కూడిన ఎజెండాను ఆమోదించారు.

గ్రామాభివృద్ధికి కృషి

ప్రవాసాంధ్రుల వెల్లడి

విశాలాంధ్ర - లింగపాలెం : కె.గోకవరం ఉన్నత పాఠశాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, గ్రామం లోని వివిధ అభివృద్ధి పనులకు విరాళాలను, స్థలాలను స్వచ్ఛందంగా ఇచ్చిన దివంగత మందడపు సుబ్బా రావు, రత్నమాణిక్యాంబల దంపతులకు చెందిన మనుమడు డాక్టర్ రాజానాయుడు, రూపనాయుడు దంపతులు అమెరికా నుంచి గ్రామానికి వచ్చి గ్రామంలో పర్యటించారు. తన తాత, అమ్మమ్మలు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుని ఆసుపత్రి, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వీరిని సత్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తన తాత, అమ్మమ్మల స్ఫూర్తితో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వీరు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాశ్చానగరం సర్పంచ్ తొమ్మండ్రు మోహనరావు, గ్రామ పెద్దలు చిన చంటియ్య, మందడపు నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు అరుణ్‌కుమార్, సహకార సంఘ చైర్‌పర్సన్ పందూరి వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ప్రశాంతి

విశాలాంధ్ర-టి.నరసాపురం: మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. ప్రశాంతి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి. ప్రసాద్ తెలిపారు. స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశాంతికి శనివారం అభినందన సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 10 వ తరగతి ప్రశాంతి ఈ నెల 11,12,13 తేదీలలో విజయనగరం జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ -17 విభాగం కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రశాంతి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ప్రశాంతికి శిక్షణ ఇచ్చిన పిడి ఎన్ ప్రభాకర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎం సి చైర్మన్ టి. నాగమణి,పలువురు ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

నాగిడి సాంబమూర్తి ధన్యజీవి

విశాలాంధ్ర-భీమవరం: లోసరి- గుట్లపాడు ఏరియాలో వేలాది బంజరు భూములను భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆక్రమించి వాటిని ఆ ప్రాంత ప్రజలకు పంచిన ఘనత భూ పోరాటయోధుడు నాగిడి సాంబమూర్తిదేనని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సాంబమూర్తి 20వ వర్ధంతి శనివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తీర ప్రాంత భూస్వాములు సాంబమూర్తిని హతమార్చా లని ప్రయత్నించిన తను నమ్మిన సిద్ధాంతా నికి కట్టుబడి భూ పోరాటాన్ని కొనసాగించి వేలాది బంజరు భూములు సీపీఐ ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడుగా నాగిడి సాంబమూర్తి పంచారని ఆయన అన్నారు. ఈ భూపోరాటంలో ఆనాటి శాసనసభ్యులు కీర్తిశేషులు వంక సత్యనారాయణ అసెంబ్లీలో ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సాంబమూర్తికి అండగా నెక్కంటి సుబ్బారావు, ఐ ఎస్ రాజు, యాళ్ల బండి పోలిశెట్టి, వీరవల్లి సత్యనారాయణ ,ఆయనకు అండగా నిలిచారన్నారు. రూరల్ మండల సీపీఐ కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి సిహెచ్ రంగారావు పార్టీ నాయకులు శాంతమూర్తి మాట్లాడుతూ నాగిడి సాంబమూర్తి ఈ ప్రాంతంలో సాగించిన పోరాటంలో ఆనాడు వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి కోసం ప్రభుత్వానికి అనేక సూచనలు చేసి సాధించారని ఈ ప్రాంతానికి కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ గాంధీని కూడా తీసుకువచ్చారని అన్నారు. ప్రజల మౌలిక సౌకర్యాల కోసం రోడ్లు విద్యుత్ స్కూలు ఆస్పత్రులు రవాణా వంటి సౌకర్యాలతో పాటు కాకినాడ నుండి నెల్లూరు వరకు కోస్తా కారిడార్ నిర్మాణంలో సాంబమూర్తి ప్రతిపాదనలే నేడు అమల్లోకి వచ్చాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు నాగిడి తులసిరావు, ఎం.శ్రీనివాసరావు, ఆకల రాము, చాంద్ బాషా, నాగిడి నాగరాజు, నాగిడి జయసుంద్రావు, తిరుమని చంటిరాజు, నాగిడి పాండు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా సాంబమూర్తి చిత్రపటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజా ఉద్యమాలతో పుట్టిన పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర-ఉండి: కార్మిక, కర్షక, ప్రజా హక్కుల కోసం పోరాడుతూ ఉద్యమాలతో పుట్టిన పత్రిక విశాలాంధ్ర తెలుగు దినపత్రిక అని డిసిసిబి చైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పివిఎల్ నరసింహరాజు కొనియాడారు. పెదమిరం లో ఉన్న వైసీపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నరసింహారాజు మాట్లాడుతూ ప్రతి తెలుగు దినపత్రిక ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టులు చేస్తున్న ప్రతి ఉద్యమాన్ని విశాలాంధ్ర దినపత్రిక ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలోనూ, ప్రజాసమస్యలు పరిష్కారం దిశగా చేయడంలోనూ అగ్ర భాగాన ఉందని కొనియాడారు. విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ ఉత్సవం సందర్భంగా యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఉండి మండల కన్వీనర్ పివిఆర్ కే ఆంజనేయరాజు, ఆకివీడు మండల కన్వీనర్ జి. ధనరాజు, పాలకోడేరు మండలం సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, డి సోమేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిజాలను నిర్భయంగా వెల్లడించే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, వాటిని పరిష్కరించ డానికి తనదైన శైలిలో ప్రజల గుండెల్లో ముద్ర వేసుకున్న పత్రిక విశాలాంధ్ర పత్రిక అని పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులతో కలిసి 2023 విశాలాంధ్ర పత్రిక క్యాలెండర్‌ను శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విలేఖరి కృష్ణ బాబు, తంకట రమేష్, ఆకుమర్తి సురేష్, పెద్దిరెడ్డి, చిడిపి రవి, నిమ్మ యేసు, వీర్రాజు, రాజేంద్ర, కునపాము సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పెన్షన్ల కింద 2,73,866 మందికి రూ. 75.89 కోట్లు

- **జిల్లాలో 8,092 కొత్త పింఛన్లు మంజూరు**
- **డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయ రాజు**

విశాలాంధ్ర - ఏలూరు : నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పెన్షన్ కింద ఏలూరు జిల్లాలో 2,30,857 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, ఒంటరి మహిళలకు జనవరి 1 వ తేదీ నుండి పింఛన్లు రూ. 2500లు నుండి రూ. 2750లకు పెంపుదల చేసినట్టు డిఆర్ డిఏ పిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మిగిలిన పెన్షన్ల తో కలిపి మొత్తం 2,73,866 మందికి రూ. 75.89కోట్లు జనవరి 1వ తేదీ నుండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో 8,092 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. జనవరి 1వ తేదీన ఉదయం నుంచి వాలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీకి అవసరమైన నిధులు సంబంధిత మండలపరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు డ్రా చేసారని ఆదివారం ఉదయం నుండి పెన్షన్ పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -ఉండి : శివ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు శనివారం ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామం లోని పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టిడిపి కుటుంబ సభ్యులు, శివ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘనస్వాగతం తెలియజేశారు. అనంతరం శివరామరాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో శివ స్వచ్ఛందసేవా సంస్థ ద్వారా ప్రజలకు మరింత సేవలను అందించేందుకు వీలుగా పరమశివుని ఆశీర్వాదం తీసుకునేందుకు వచ్చానని చెప్పారు. ఈ సందర్భంగా తనకు ఘన స్వాగతం పలికిన అగ్రహారం గ్రామ ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు . తదనంతరం పొత్తూరి వెంకటేశ్వరరాజు, దూసనపూడి రాంబాబు, బురిడి రవిబాబు, తదితర నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముగ్గళ్ళ సత్యన్నారాయణ, వేంద్ర నాని, కేతా మణికంఠ, దుర్గా ముసలయ్య, పరిమి కాశీ విశ్వేశ్వరరావు, వెంకన్న, ఉండి గణేష్, కుడిపూడి ప్రసాద్, కేతా స్వామి, రావూరి కృష్ణకాంత్, భరత్,కదలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర - ముసునూరు: విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వం అందించే ఉత్తమ విద్యను అందిపుచ్చుకుని భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా నిలవాలని ఏలూరు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి యం.నాగేశ్వర రావు అన్నారు. శనివారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు యం.డి కరిముల్లా ఆధ్వర్యంలో మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి ,విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం ఎలా వుందంటూ ఉపాధ్యాయుల బోధన విషయాలు, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని కూడా పరిశీలించి, అక్కడ గర్భిణీలకు, బాలింతలకు, అంగన్‌వాడి విద్యార్థినీ విద్యార్థులకు ఇచ్చే ఆహారం తనిఖీ చేశారు.

రోటరీ క్లబ్ యువజన ఉత్సవాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన మహోత్సవాల క్రీడా పోటీలలో "మేధా" ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని విద్యార్థులు45 మంది సబ్ జూనియర్స్ వివిధ పోటీలలో, పరువు పందెం, చదరంగం, కోకో, కబడ్డీ, షాట్ పుట్, లాంగ్ జంప్, డాన్స్ బేబీ డాన్స్, పాటల పోటీలలో బహుమతులను సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ మధు తెలిపారు. విద్యార్థుల విజయానికి కారుకులైన పి ఈ టీ రవి బాబును అభినందించారు. ఈ పోటీలు నిర్వహించి విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసిన రోటరీ క్లబ్ సభ్యులకు మధు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర - ఏలూరు : నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభ తరుణంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి సమిష్టి కృషితో కొత్త సంవత్సరంలో కొత్త ఆశయాలతో, లక్ష్యసాధనతో జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలుపుదామన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు జిల్లా ప్రజలందరికి, ప్రజా ప్రతినిధులకు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

విశాలాంధ్ర - పోడూరు: సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లది కీలక మైన పాత్రఅని వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని పాలకొల్లు నియోజకవర్గ ఇన్ చార్జ్, జడ్పీ చైర్మన్ కౌరు శ్రీనివాస్ అన్నారు. మండలం లోని 8 గ్రామాలకు సంబందించిన వాలంటీర్ సచివాలయం కన్వీనర్ లతో జిన్నూరు లో జరిపిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుండి జరగబోయే పింఛన్ వారోత్సవాలలో వాలంటీర్లు కన్వీనర్లు కలిసి లబ్ధిదారులకు పెంచిన పింఛన్ల గురించి వివరంగా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కుమార దత్తాత్రేయ వర్మ మండల ఎంపీపీ సుమంగళి జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు టీటీడీసీ బాబు, గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఆనందంగా ఉండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : ఎస్ సి,ఎస్ టి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఆనందంగా ఉండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని టీడీపీ రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు అన్నారు. మండలంలోని పేరంపేట గ్రామంలో జై భీమ్.. జై తెలుగుదేశం... అనే కార్యక్రమంలో భాగంగా శనివారం టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు గోలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ సి పేటలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ సేవా సమితి అధ్యక్షులు ఆకుమర్తి రామారావు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో దళిత ఓట్లతో గెలుపొందిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం దళితుల పైన కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, దళితులపై అనేక రకాలైన ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు గోలి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆకుమర్తి రామారావు వారు అనేక సేవా కార్యక్రమాల్లో ముందుకు దూసుకుపోతున్నారని అన్నారు. ఆయన కష్టపడి సంపాదించిన దానిలో 10శాతం ఆపదలో ఉండే వారికి ఆదుకుంటున్నందుకు పేరంపేట గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆకుమర్తిని అభినందించారు. పేరంపేట గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న జల్లా నాగమ్మ ముయ్యటి అంకాలమ్మ, ఎడ్లపల్లి నాగరత్నం ,కంకిపాటి రామలక్ష్మి కలపాల మహాలక్ష్మి, కలపాల నాగమ్మ లకు ఒక్కొక్కరికి రూ. 2వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వృద్ధులకు చీరలో దుప్పట్లు రూపంలో రూ. 80 వేలు అందించారు. గ్రామ సర్పంచ్ కంకిపాటి కుమారి మండల ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు గెద్దల శ్రీను, మాజీ సర్పంచ్ గంటా రామారావు, కంకిపాటి భార్గవ్, జాలాది గోపాలకృష్ణ ,పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, గోలి సత్తిరెడ్డి, వార్డు మెంబర్ కారుమూరి దుర్గారెడ్డి, టీడీపీ నాయకులు కంకిపాటి సుబ్బారావు, మోయేటి పండు, లాగు రాంబాబు, మనేలి రాంబాబు, గుళ్ళ శ్రీను, డొక్కా దుర్గారావు, చింతలపూడి నియోజకవర్గ తెలుగు మహిళా విభాగం మహిళా అధ్యక్షురాలు శిల్ప రెడ్డి ఇంద్రాణి, పేరంపేట బాబు జగజ్జీవన్‌రామ్ యువజన యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మా పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు

విశాలాంధ్ర - చాట్రాయి : ఎమ్మెల్యే గారు... స్థానిక నాయకులు మా పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు.. మాకుఇళ్ళ స్థలం రానివ్వలేదని... ఒకరు... మమ్మల్ని మీదగ్గరకు రానివ్వలేదు.. మేము తిరువూరు నియోజకవర్గంలో వున్నప్పుడే మీరు మాకు పని చేసి పెట్టారు. ఇప్పుడు ఇదేంఖర్మ అంటూ దళితులు వారి ఆవేదన వ్యక్తంచేశారు. చాట్రాయి మండలం చిన్న పేట గ్రామంలో గత రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దళితవాడలో తిరుగుతున్న సందర్భంలో నూజివీడు ఎమ్మెల్యే దృష్టి కి దళితుల బాధలను ఏకరువు పెట్టారు. పాత దళిత వాడలో తేళ్ళూరి ప్రసాద్ అనే బాధితుడు మాట్లాడుతూ నాకు ప్రభుత్వం నుంచి ఇళ్ళ స్థలం రానివ్వలేద న్నారు. నాకు ఇవ్వాల్సిన డబ్బులు పెద్ద మొత్తంలో ఇవ్వడం లేదన్నారు. మా పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కోఆపరేటివ్ ఫారం దళిత వాడలో మాజీ ఎంపీటీసీ రమేష్ మాట్లాడుతూ చాట్రాయి మండలం తిరువూరు నియోజకవర్గంలో ఉన్నప్పుడు కరెంటు సమస్యపై మీ వద్దకు మేము వస్తే ఆనాడు మాకు పని చేసి పెట్టారు. ఇప్పుడు మీరు మాకు ఎమ్మెల్యే అయినా కనీసం మేము మీ వద్దకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఆరోజు మీరు మాకు సంతకం పెట్టకపోవడం వలన కేంద్ర ప్రభుత్వం నుండి రెండు లక్షల రూపాయల పైగా వచ్చేవి. మీ స్థానిక నాయకుడు అడ్డుకోవడం వలన మీ పిఎ మమ్ములను కనీసం మీ దగ్గరకు కూడా రానివ్వలేదు. అప్పుడు అలా ఇప్పుడు ఇలా...? మాకెందుకు ఈకర్మ అంటూ ప్రశ్నించారు. సిపిఎం మండల నాయ కులు కొమ్ము ఆనందం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

నగర ప్రజలకు బడేటి చంటి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - ఏలూరు: టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, నాయకులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక బడేటి చంటి క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, ఎ ఏంసి మాజీ చైర్మన్ పూజారి నిరంజన్, మాజీ కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో అందరికీ మేలు జరగాలి

జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

విశాలాంధ్ర - ఏలూరు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రూ. 100 కోట్ల తో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్టు జెడ్పి చైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. శనివారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జెడ్పి చైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన ప్రణాళిక, ఆర్థిక, పనుల, స్థాయి గ్రామీణాభివృద్ధి విద్యా, వైద్య, వ్యవసాయ, మహిళా సంక్షేమ, సాంఘీక సంక్షేమ స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సంబంధిత జెడ్పిటిసిలకు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఖచ్చితంగా తెలియజేయాలని ఆయన ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నవరత్నాల పథకం కింద అమలు చేసే అన్ని సంక్షేమ ఫలాలు ఖచ్చింతంగా అందుతాయన్నారు. సమావేశంలో ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అందించడంతోపాటు ఆయా కార్యక్రమాలు ద్వారా చేపడుతున్న పనులు పురోగతిని సంబంధిత శాఖల అధికారులు జెడ్పి చైర్మన్, ఆయా స్థాయి సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులకు తెలియజేశారు. ఈ స్థాయి సంఘాల సమావేశాల్లో శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జి, జెడ్పి వైస్ చైర్మన్లు పోసిన శ్రీలేఖ, పి. విజయబాబు, జిల్లా ప్రజా పరిషత్ సిఇఓ కె. రవికుమార్, డిఆర్ డిఏ పిడి విజయరాజు, హౌసింగ్ పిడి వేణుగోపాల్, వివిధ శాఖలకు చెందిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు, స్థాయి సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల కృషి అభినందనీయం

విశాలాంధ్ర -కైకలూరు : జగనన్న సైనికులుగా పిలవబడుతున్న గ్రామ వలంటీర్లు ప్రభుత్వ, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారని మీ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో ఇప్పుడు నియమించిన సచివాలయ కన్వీనర్ల తో మీరు సమన్వయంగా పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు (డిఎన్ఆర్) కైకలూరు మండలం గ్రామ వాలంటీర్లను ఉద్దేశించి అన్నారు. శనివారం కైకలూరు మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో గ్రామ వాలంటీర్లతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జనవరి ఆరవ తేదీ నుంచి ఒక్కో వాలంటీర్ కు అనుసంధానం గా ఇద్దరేసి చొప్పున గృహ సారథులు వస్తారని, వారితో కూడా సమన్వయంగా పనిచేసి ప్రభుత్వం ఇంటింటికి మరింత చేరువయ్యే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే డిఎన్ఆర్ కోరారు. నియోజకవర్గ పరిశీలకునిగా విచ్చేసిన రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయానికి ఒక మహిళ ఇద్దరు పురుషులు చొప్పున కన్వీనర్లను నియమించడం జరిగిందని గ్రామ వాలంటీర్లు ఇంతకుముందు పనిచేస్తున్న విధంగానే ముమ్మందు పనిచేసుకుంటూ వెళ్తూ గ్రామ సచివాలయ కన్వీనర్ లను సమన్వయం చేసుకుంటూ గృహసారథులను ప్రతి ఇంటికి చేరువ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీలు కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రి సంతోష్,ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, జడ్పీటీసీ కురేళ్ల బేబీ,మార్కెట్ యార్డ్ చైర్మన్ దండే పుష్పలత, కైకలూరు సర్పంచ్ డి ఎం. నవరత్న కుమారి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-మండవల్లి: జనవరి 2 వతేదీనుండి జరిగే గ్రామసభల్లో పౌరులందరు పాల్గొని గ్రామసభలను విజయవంతం చేద్దామని సమాచార ప్రచారహక్కు ఐక్యవేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావులు అన్నారు. శనివారం మండవల్లి గ్రంథాలయం వద్ద ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ గ్రామసభల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామసభల నిర్వహణ సమర్థవంతంగా సాగితేనే గ్రామసీమలు అభివృద్ధి పథాన పడతాయని ఐక్యవేదిక నాయకులు అన్నారు. యువత పెద్ద సంఖ్యలో గ్రామసభల్లో పాల్గొనటం వల్ల ఉపయోగకరమైన సూచనలు అందచేయవచ్చని యువతరం చేతిలోనే భవిత ఉందన్నారు.

కళలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సమాజంలో జానపద పౌరాణిక బుర్రకథ కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రముఖ బుర్రకథ భజన గురువు మామిళ్లపల్లి సుబ్బారావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో ముక్కోటి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీ సరస్వతి బుర్రకథ దళం వీరమల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బుర్రకథ భజన గురువు మామిళ్ళపల్లి సుబ్బారావు,సామ్రాజ్యం దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా కళామతల్లి సేవలో ఎంతోమంది కళాకారులను తయారు చేయటం ఆత్మసంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. తనకు పుట్టిన గడ్డపై సన్మానం పొందటం చాలా గర్వంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బచ్చు నందకుమార్, తిప్పర్తి వీర బ్రహ్మాచార్యులు, టీవీఎస్ రాజు, బచ్చు జగన్మోహన్ రావు, వీరమల్ల మధు, కొనకళ్ళ అప్పన్న,పుల్లారావు, దారా ధనంజయరావు, కొనకళ్ళ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-టి నరసాపురం : జగనన్న కాలనీ లే అవుట్ లలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి జి. సుధాకర్ తెలిపారు. మక్కినవారిగూడెం, బండివారిగూడెం గ్రామాల్లో హౌసింగ్‌డే ను పురస్కరించుకొని జగనన్న కాలనీ లబ్దిదారులతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా పేదలందరికీ నూతన గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని తెలిపారు. జగనన్న కాలనీ లే అవుట్ లలో పూర్తి స్థాయి లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె వి సుబ్బారావు, ఎంపిడిఓ ఎన్ టి స్వామి, హౌసింగ్ ఎఇ జి. రాధాకృష్ణ,ఎపిఒ శ్రీనివాస్, బండివారిగూడెం సర్పంచ్ నాళం శిరీష కాశీ,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

విశాలాంధ్ర - లింగపాలెం : బావిలో దూకి కొత్తపల్లికి చెందిన బుద్దారపు శాంతమ్మ(62) ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం బట్టి ఈమెకు కొంతకాలంగా మతిస్థిమితం లేదని అనారోగ్యంతో బాధపడుతుందని తెలిపారు. భర్త సూరయ్య ద్విచక్రవాహనంపై రంగాపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మంచినీరు కావాలని వాహనాన్ని ఆపి రహదారి ప్రక్కన ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని వెలికితీసేందుకు 80 అడుగుల లోతులో ఉన్న నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించి మృతదేహాన్ని తీశారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో లారీలలో ఎక్కించిన ధాన్యం ఎగుమతులు నిలిచిపోయాయి. మిల్లర్లకు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీ పూర్తవటంతో మిల్లర్లు ధాన్యాన్ని తీసుకునేందుకు అంగీకరించటంలేదు. మండలంలో ఐదు లారీలలోని 100 మెట్రిక్ టన్నుల ధాన్యం నిలిచిపోవటంతో రైతులు ఆందోలన చెందుతున్నారు. బ్యాంకు గ్యారంటీ మిల్లర్లకు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.